అమ్మ

శ్రీ కాళూరి హనుమంతరావు

రైలు అమిత వేగంతో టకటకమని కటువైన శబ్దాలని చేసుకొంటూ ఏవో చిన్న చిన్న స్టేషన్లనీ, వాట్లలోనుండి తెల్లబోయి ఆగకుండా పోతున్న రైలుని చూస్తున్న జనాన్ని, అక్కడక్కడ చెరువులని, కాలువలని, బీళ్లనీ పొలాలనీ దాటుకొంటూ పోతున్నది. అంతా మాయగా, బొమ్మలాటలాగ అనిపిస్తున్నది నాకు. నా మనస్సుమాత్రం రెపరెపలాడుతూ రైలుకన్నా వేగంగానే ముందుకి ప్రయాణంచేస్తున్నది. ఎప్పుడో రెండుమూడు సంవత్సరాలకి ఒకసారి సెలవుమీద తెనుగుదేశంలోకి రావడం, చుట్టాలనూ, స్నేహితులనూ చూడ్డం అనేది ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలలో సెటిల్ అయిపోయిన నాబోటివాళ్లకు ఉత్సాహాన్నికలిగిస్తూ వుంటుంది. ఆదివారంనాడు బయలుదేరి వస్తున్నానని బెజవాడలోఉన్న మా చెల్లెలు లక్ష్మికీ, విశాఖపట్నంలోఉన్న నా ముఖ్య స్నేహితుడు రమణకీ ఉత్తరాలు వ్రాశాను. విశాఖపట్నంలో ఒకటో రెండో రోజులు ఉండి బెజవాడ వెళ్దామని సంకల్పం, కాని సెలవు ఇంకా తొందరగానే సంపాదించి శుక్రవారంనాడే బయలుదేరాను. ఈసారి నా తొందరకి తగినంత కారణం లేకపోలేదు. మా చెల్లెలినీ దాని పిల్లలనీ చూసి రెండేళ్లయింది. దానికి ఇద్దరు కూతుళ్ల తర్వాత పుట్టిన మొదటికొడుకుని ఇంకా నేను చూడనే లేదు. కాగా మా స్నేహితుడు రమణకి ఈమధ్యనే పెళ్లయింది. అతడిని చూడాలని ఎంతో ఆదుర్దాగా వుంది. అయిదేళ్ళయింది అతడిని చూసి.

ఐదేళ్ళు! నేనిప్పుడు చెయ్యగలిగిందల్లా ఈ అయిదేళ్లనూ తలచుకొని ఒక దీర్ఘనిశ్వాసం విడవడమే. నా జీవితం నా అదుపులోనుంచి ఏనాడో తప్పిపోయింది. ఇంక అది బాగుపడదు. నాబోటి మనుష్యులు సుఖపడడంకోసం పుట్టరు. కారణం జీవితంలో సుఖపడడం అంటే ఒక నిశ్చితాభిప్రాయం లేకపోవడమే. కాని నాకుపూర్తిగా విరుద్ధం మా రమణజీవితం. ఈ అయిదేళ్లలోనూ రమణ జీవితాన్ని బాగా లొంగదీసుకొన్నాడు. పరిస్థితులను బాగా ఉపయోగించుకొని వృద్ధిలోకి వచ్చేడు. యమ్. యస్. సీ ఫస్టుగా పేసయాడు. ఆంధ్రాయూనివర్సిటీ కాలేజీలో లెక్చరరుగా పనిచేస్తున్నాడు. వచ్చే ఏడాది అమెరికా వెళ్తాడట! అతడి గృహస్థజీవితం ఎంతో హాయిగా ఉంది. అతడు ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాడు. జీవితంలో రమణ బాగుపడ్డందుకు నాకు సంతృప్తిగా, సంతోషంగా ఉంది.

నేనూ, రమణా గాఢ స్నేహితులమైనా అతడికీ నాకూ అభిరుచులలోగాని, అభిప్రాయాలలోగాని, కనీసం శారీరకమైన రూపంలోనూ, పొడుగులోనూ గాని ఏమీ సామరస్యం లేదు. అతడు ఒడ్డూ, పొడుగూ ఉన్నవాడు. బలిష్ఠుడు. అందగాడు. నేనందుకు పూర్తిగా విరుద్ధం. అతడికి కార్యకలాపాల ప్రమేయం ఎక్కువ. హుషారుగా పదిమందితో పరిచయం కావాలని కల్పించుకొని నవ్వుతూ తిరిగే స్వభావం. అందర్నీ ఆకర్షిస్తాడు. కాని వెకిలి మనిషి మాత్రం కాడు. అతడిది గట్టివ్యక్తిత్వం. మనస్సులో లోతు ఉంది. అతడికి నేనంటే ఎంతో అపేక్ష. అందుకనే అతడికి పరిచయస్థులు ఎందరో ఉన్నా నా ముందు మాత్రం ఎంతో చనువుగా దాచుకోకుండా మాట్లాడతాడు. గత ఐదేళ్ళగా మేమిద్దరం కలుసుకోకపోయినా, ఎడతెగకుండా ఉత్తరప్రత్యుత్తరాలు జరుగుతూనే ఉన్నాయి.

నేనూ రమణా చిన్నతనంనుంచీ స్నేహితులం కాదు. విజయనగరంలో ఇంటరు చదివే రోజుల్లో ఇద్దరికీ పరిచయం కలిగింది. ఇద్దరం ఒకే క్లాసు. ఒకే

గ్రూప్‌లో ఉన్నా అంతమంది మధ్య ప్రత్యేకంగా స్నేహంచేసే అవకాశం నాకు అంతగా లేకపోయేది. చిన్నతనం నుంచీ నాకు ఏకాకిగా ఉండే గుణం ఎక్కువ. స్నేహితులను అన్వేషించను. రమణతో పరిచయం కూడా దానంతట అదే వచ్చింది. నేనూ, రమణా బేడ్‌మింటన్ కోర్టులో కలుసుకొనేవాళ్ళం. అతను బేడ్‌మింటనే కాక ఎన్నో ఆటలు ఆడేవాడు. నేనొక్క బేడ్‌మింటన్ మాత్రం బాగా ఆడేవాడిని. అతను నన్ను ఆటలో మెచ్చుకొనేవాడు. మా పరిచయం అట్లా ఆరంభం అయింది. అతను పరీక్షలలో చాలా బాగా మార్కులు తెచ్చుకొనేవాడు. కష్టపడి చదివేవాడు. అతడి నిత్యజీవితంలో ఎంతో దీక్ష ఉండేది. నేనంత శ్రద్ధగా చదవలేకపోయేవాడిని. నాకా సైన్సుపాఠాలు అంతగా గ్రహింపుకు వచ్చేవి కావు. అది గమనించే ఎలాగే అదృష్టవశాత్తూ ఇంటరు పేసయాక బి. యస్. సీ కాకుండా బి. ఏ. లో చేరడానికి ప్రయత్నించాను. నాకు సాహిత్యంలో అప్పటికే కొంత సరదా ఉండేది. అందుకని బి.ఏ. ఇంగ్లీషు, తెలుగో చదువుదామనుకొన్నాను. కాని నాకందులో ప్రవేశార్హత లేకపోయింది. బి.యస్.సీ. లో చేరవలసి వచ్చింది. దానితో నాకు చదువుమీద విరక్తి కలిగింది. ఈ కాలేజీ చదువంతా నాకేదో ద్రోహం చేస్తున్నట్లు బాధ కలిగేది. క్లాసులో వెనక బెంచీలమీద కూర్చొని టాగోరు రచనలు, హార్డీ నవలలు చదువుకొనేవాడిని. ఆ రోజులని తలచుకొంటే ఇప్పుడు నాకు నవ్వొస్తుంది. విచారం కలుగుతుంది. కాని అప్పుడుమాత్రం క్లాసులో పాఠాలు వినకుండా సాహిత్యం చదువుకోవడంలో నా మట్టుకు నాకు బాగా తృప్తిగా ఉండేది. చివరికి నేను బి. యస్. సీ. పేసు కావడానికి రమణే కారణం. ఇన్నాళ్ళూ రమణారావు అని రాసుకొనేవాడు నా కోరికను మన్నించి ఈసారి పరీక్ష అప్లికేషన్‌లో పూర్తిగా జానకీరమణారావు అని రాసుకొన్నాడు. అంచేత అతడూ నేనూ పరీక్షలో ప్రక్క ప్రక్కల్ని పడ్డాం. అదే నేను పరీక్ష పేసు కావడానికి కారణం. తర్వాత నేను రైల్వేలో ఉద్యోగం సంపాదించి తెనుగుదేశం విడిచిపోయాను. నా అభిరుచులకీ, చదివిన చదువుకీ, చేస్తున్న ఉద్యోగానికీ ఏమీ సంబంధం లేదు.

ఇదంతా నాకూ రమణకూగల సాధారణ పరిచయం. దీనికన్నా మా స్నేహానికీ, పరస్పర ఆకర్షణకీ ముఖ్యకారణం ఉంది. రమణకి తండ్రి లేడు. చిన్నప్పుడే చచ్చిపోయాడు. అతడిని పూర్తిగా వాళ్ళ అమ్మే పెంచింది. నాకు తల్లి లేదు. మా చెల్లెలు లక్ష్మి పుట్టిన ఏడాదికి మా అమ్మ చచ్చిపోయింది. మా అమ్మ ఎలాగుండేదో కూడా నాకు జ్ఞాపకం లేదు. మా చెల్లెలు అచ్చు మా అమ్మ పోలికేనని మా నాన్నగారు అనేవారు. లక్ష్మిని చూసి గతించిన మా అమ్మను చూసినట్లే సంతృప్తిపడి దుఃఖపడతాను.

నాకు రమణ అత్యంత సన్నిహితుడు కావడానికి ఈ తేడాయే కారణం. అతడు తల్లి తనని చిన్నతనంనుంచీ ఎంత కష్టపడి పెంచిందో చెప్పేవాడు. నేను మా అమ్మని జ్ఞాపకం చేసుకొంటూ వినేవాడిని. రమణని పెంచడంకోసం అతడి తల్లి పడని కష్టం అంటూ లేదు. అసలే బీదగా ఉండే వాళ్ళ కుటుంబం రమణ తండ్రి మరణంతో వీధిని పడింది. అతడి తల్లి అప్పుడు ఇంకొకరి ఇంట్లో వంట మనిషిగా చేరి రమణని పోషించింది. అతను కొంచం పెద్దవాడయాక నోటి మంచితనం చేత వాళ్ళదగ్గిరా వీళ్ళదగ్గిరా ప్రాధేయపడి వారాలు సంపాదించి పెట్టింది. తను సంపాదిస్తున్న ఆ కొద్దిపాటి డబ్బుతోనూ అతడిని స్కూలులో ప్రవేశపెట్టింది. జీతం కట్టడానికి డబ్బు చాలకపోతే దేహీ అని నలుగుర్నీ యాచించింది. అతను ఒక్కొక్క క్లాసే పేసవుతూ పైకి వస్తూవుంటే అతడిమీద ఆమె ప్రోగుజేసుకొంటున్న ఆశలు కూడా ఒక్కొక్కమెట్టే హెచ్చుతూ వచ్చేయి. రమణపరీక్ష పేసయిన రోజున "పరీక్ష పేసయానమ్మా!" అని ఆమె రెండు పాదాలకీ నమస్కారం చెయ్యడం అలవాటు. అలాగే స్కూల్ ఫైనల్ పేసయిన రోజున కూడా చేశాడు. ఆమె ఆనందంతో మాట్లాడలేక పోయింది.

"సంతోషం నాయనా! అదేదో ఉద్యోగం అన్నావు: ఇంజనీరుగారిని బ్రతిమాలుకొని ఆ ఉద్యోగం అయేటట్టు ప్రయత్నిస్తే మన కష్టాలు గట్టెక్కుతాయి." అంది కొంతసేపటికి.

"అవును. ఇప్పుడే ఇంజనీరుగారి దగ్గిరకి వెళ్తున్నాను" అన్నాడు రమణ. రమణ స్కూల్ ఫైనల్ ఫస్టుగా పేసయాడు. అతడికి కాలేజీలో చదవాలని

ఉంది. కాని ఆఉద్దేశం అమ్మతో చెప్పలేదు. తన చదువుకోసం అమ్మ ఎంత కష్టపడుతోందో ప్రత్యక్షంగా చూస్తున్నాడు. చేతులారా ఇంకా ఆమెను కష్టపెట్టలేదు.

కాని తీరా ఆ ఇంజనీరు గారిని ఉద్యోగానికి సిఫార్సు చెయ్యమని అడిగితే స్కూల్ ఫైనల్ క్వాలిఫికేషన్‌తో ఏమాత్రం ఉద్యోగం వస్తుంది అని నచ్చచెప్పి, చదువుకొని వృద్ధిలోకి రాతగినవాడు కనుక బి. ఏ. వరకూ చదువుకయ్యే ఖర్చు తను భరిస్తానని మాట ఇచ్చి కాలేజీలో చేర్పించారు. వారి ప్రోత్సాహంవల్లనే రమణ బి. యస్. సీ వరకూ అడ్డు లేకుండా పేసయాడు. బి. యస్. సీ. లో కాలేజీకి ఫస్టుగా పేసయాడు. అంచేత కాలేజీలో డిమాన్‌స్ట్రేటరు ఉద్యోగం లభ్యమయింది. అలా రెండేళ్లు పనిచేసి, కొంత డబ్బు కూడబెట్టుకొని, ఆంధ్రా యూనివర్సిటీకి వెళ్లి ఎమ్. యస్. సీ చదివి పాసయాడు. తర్వాత అక్కడే ముందు డిమాన్‌స్ట్రేటరుగా చేరి ఇప్పుడు లెక్చరరు అయాడు.

రమణకోసం అతడి తల్లి మొత్తంమీద ఇరవై సంవత్సరాలు కష్టాలు పడింది. ఈ కష్టాలన్నిటిలోనూ ఒక్కటిమాత్రం రమణ హృదయంలోకి హత్తుకుపోయింది. మా స్నేహం బాగా అభివృద్ధి చెందాక ఎంతో మనస్ఫూర్తిగా ఒకనాడు నాతో చెప్పేడు—

“అంతవరకూ నాకు మా అమ్మఅంటే ఎంతో భక్తి ఉండేది. ఒక నిర్మల దేవతామూర్తిని చూసినట్లు చూసేవాడిని. కాని ఆ వేళతో గాలివంటి నా ఊహలన్నీ పోయి చిక్కని నిజాన్ని ఎదుర్కొన్నాను. మా అమ్మని దొంగగా సహించలేక బాధపడ్డాను. కాని దొంగతనం చేసింది నా స్వంత అమ్మ! నాకోసం! ఓర్చుకోకతీరదు” అన్నాడు. రమణ స్కూల్ ఫైనల్ పరీక్షకి కట్టడానికి డబ్బు సంపాదించే అన్ని ప్రయత్నాలూ విఫలంకాగా చివరకు ఆమె ఈ పనిచేసింది. మరో పరిస్థితిలో ఐతే ఆమెను నిలువునా కోసినా దొంగతనం చెయ్యదు. కొడుకుకోసం నీతిని చంపుకొని దొంగతనం చేసింది. దొంగతనమే కాదు, అతడి కోసం ఏమైనా చేస్తుంది. ఇది ఆమెలో నైచ్యమో, ఔన్నత్యమో మాత్రం నాకర్థం కాలేదు.

ఇలా నాతో తన మనస్సులో దాచుకొన్న విషయాలు ఎన్నో చెప్పేవాడు. అవన్నీ ఇప్పుడు జ్ఞాపకం వచ్చి ఆరాటం కలుగుతోంది. రైలు భయంకరమైన రాత్రిలోంచి పోతోంది. నాకేమో ఒక లోకంలోంచి ఇంకోలోకం లోకి పోతున్నట్లుగా అనిపించింది, ఆ చీకటీ, ఆ రైలూ, ఒంటరిగా ఆ ప్రయాణమూను. నేను మెల్లిగా చోటు చేసుకొని పడుకొన్నాను. కాని నిద్రమాత్రం అంత తేలికగా రాలేదు.

రైలు వాల్తేరు చేరేసరికి మర్నాడు ఉదయం పది గంటలు దాటింది. కంపార్టుమెంట్ గేట్ దగ్గర నిలబడి ప్లాట్‌ఫారంమీద రమణకోసం చూశాను. దూరంగా కనిపించాడు. చెయ్యి ఊపి నాపెట్టె ఆగబోతున్న దిక్కుకి తొందరగా వచ్చేడు. రైలు దిగేసరికి నా చేతిని అతడిచేతిలోకి తీసికొన్నాడు. ఎంతో ఆప్యాయంగా మాట్లాడాడు. రైల్లో ఉన్నంతసేపు ఇదివరకంత స్వేచ్ఛగా నిస్సంకోచంగా నేనూ, రమణా మాట్లాడుకొంటామా అని ఒకమూల అనుమానిస్తునే ఉన్నాను. కాని ఆ అనుమానాలన్నీ వాయుభూత మేఘాలవలె చెదరగొట్టాడు రమణ. నాభుజంమీద చెయ్యివేసి స్టేషన్‌లోంచి బయటికి తీసుకువెళ్లాడు. నేను కుశల ప్రశ్నలు చేశాను.

“మీ అమ్మగారు ఆరోగ్యంగా ఉన్నారా?” అని అడిగాను.

“ఆ! ఉంది.” అన్నాడు ముక్తసరిగా. ఇంటికి వెళ్ళగానే భార్యని నాకు పరిచయం చేశాడు. ఆమె ఒట్టి చదువుకొన్నదే కాదు. నిజంగా తెలివైనదీ, చురుకైనదీని. నా భోజనాదులభారం అంతా ఆమెకే వదిలేసి “కాలేజీకి వెళ్లొస్తాను బ్రదర్ రెస్టు తీసుకో. మధ్యాహ్నం ఐదింటికల్లా వచ్చేస్తానులే” అని వెళ్ళిపోయాడు. రోజూ ప్రొద్దున్నే వెళిపోతాడట. ఇంటికొచ్చేసరికి రాత్రి ఏడు గంటలు దాటుతుందట. ఆవేళ నాకోసం పెందరాళే వస్తాడన్న మాట! “అవును మరి. కాలేజీపని చేస్తూ స్వంత రిసెర్చి చేసుకోవద్దూ” అని సరిపెట్టుకొన్నాను. సాయంకాలం ఐదుగంటలకి రమణ వచ్చేడు. నేనూ, రమణా, అతడిభార్యా రాత్రి సినిమాకి పోయాం.

మర్నాడు ప్రొద్దున్న నేను బద్ధకంగా ఇంకా ఏపనీ తోచకుండా కూర్చున్నాను. అతడు స్నానం చేసి, బట్టలు వేసుకొని తయారైనాడు.

"ఎక్కడికి?" అన్నట్టు చూశాను.

"కొద్దిగా పనుంది. కాలేజికి వెళ్లివస్తానోయ్. ఒంటిగంటవుతుంది నేను వచ్చేసరికి. నాకోసం చూడక నువ్వు భోజనం చేసెయ్" అన్నాడు.

"ఇవాళాదివారం కదటోయ్! కాలేజీ ఏమిటి?" అన్నాను.

"మా రిసెర్చి డైరెక్టరుది అంతా ఒక ప్రత్యేక గుణంలే. అతనికి ఇంట్లో పనీ పాటూ ఏమీ వుండదు. ఆదివారంనాడు ప్రత్యేకంగా వచ్చి డిపార్టుమెంట్లో పీకమీద కూర్చుంటాడు. ఆవేళ ఎవరెవరయితే కని పిస్తారో వాళ్ళంతా శ్రద్ధగా రిసెర్చి చేస్తున్నట్లు, లేని వాళ్ళు ఎందుకూ కొఅగాపండా తిరుగుతున్నట్లూ నిర్ధారణ చేసుకొంటాడు. ఇవాళ నన్ను ప్రత్యేకంగా రమ్మనికూడా చెప్పేడు. ఉద్యోగంలో బాస్ అన్న వాడు ఖర్మకొద్దీ దొరుకుతూవుంటాడు" అని వెళి పోయాడు. నాకేమీ ఆ ఇంట్లో తోచలేదు. ఊళ్లో ఇంకెవ్వరూ తెలియదు. నా పరిస్థితి గమనించి లోపల పని చేసుకుంటున్న రమణ భార్య నాకు రమణ పుస్తకాల షెల్ఫు చూపెట్టి వెళిపోయింది. నేను ఆ పుస్తకాలు తిరగ వెయ్యసాగానుకాని అవికూడా నాకంతగా సరదా కలిగించలేదు. వాట్లల్లో కొన్ని నేను ఏనాడో చదివేసినవి. తక్కినవి నాకు సంబంధించనివి.

ఆ సమయంలో వచ్చింది రమణ తల్లి. నిన్న మధ్యాహ్నం ఒక్కసారి కనిపించింది. మళ్లీ ఇప్పుడే కనిపించడం.

"అయితే నువ్వు ఏ ఊళ్లో ఉంటున్నావు బాబూ?" అడిగింది.

"చక్రధర్ పూర్‌లో ఉంటున్నానండీ."

"జీతం ఏమిస్తారు?"

"ఏదో నూటపాతిక."

"చాలా చిక్కిపోయావు."

"ఒంట్లో ఆరోగ్యంగా ఉండడం లేదండీ."

"నా ఒంట్లోనూ ఆరోగ్యం సరిగా లేదు. నాయనా! ఒకపూట తింటే ఇంకోపూట సయించదు. నీతో మందు పుచ్చుకొందామా అంటే ఈ ఇంట్లో నా గోల ఎవరికి పట్టింది? నేను చచ్చేనో బ్రతికేనో చూసేవాళ్లెవరు?" అంటూనే ఆమె కూలబడి బొట బొట కళ్ళనీళ్లు కార్చేసి పైటతో తుడుచుకొంటూ వెక్కి వెక్కి ఏడ్చేసింది. నేను బిత్తరపోయి చూశాను. ఆమె హఠాత్తుగా శ్రుతి హెచ్చించి "అర్ధాన్నపు అడివి ఐపోయింది నా బ్రతుకు. చిన్నప్పటినుంచీ వాళ్లింటా వీళ్లింటా వంటపని చేశాను. ఇప్పుడు కొడుకు పంచనే వంటదానిలా ఉన్నాను. నామాట ఎవ్వరూ వినరు. చిన్నప్పటినుంచీ నెత్తురు పిండుకొని పోషించాను. ఇప్పుడు వాడూ పెళ్లాం ఒకటైపోయి నా మాట వినకుండా నన్ను అష్టకష్టాలూ పెట్టి బ్రతక నియ్యకుండా చేస్తున్నారు." అంటూ 'గీ' మని కంఠం ఎత్తి ఇల్లు అదిరిపోయేలా ఏడవ సాగింది. ఈ గోలకి రమణ భార్య గదిలోకి వచ్చి చూసి విసుగుదలతో మొహం ముణుచుకొని వెళి పోయింది. నాకామెను ఓదార్చడం ఎలాగో తెలియ లేదు. ఊరికే నిలబడ్డాను. రెండు నిముషాలలో ఆమె తేరుకొని, మొహం తుడుచుకొని లోపలికి వెళ్ళి పోయింది. ఆ ఇంట్లో పరిస్థితులు సరిగా లేవని అర్థం అవుతోంది. నిన్నటినుంచీ గమనిస్తున్నాను. రమణ గాని, రమణ భార్యగాని ఆమెతో అత్యావసర పరిస్థితి ఏర్పడితేగాని మాట్లాడడం లేదు.

రమణ కాలేజీ నుంచి తిరిగి వచ్చిన దగ్గిర్నుంచీ దీన్నిగురించే అడుగుదామని అనుకొంటున్నాను. కాని సంకోచం కలుగుతోంది.

"మీ అమ్మగారికి ఆరోగ్యం సరిగా లేదను కొంటాను." అని మాత్రం అనగలిగాను చివరికి.

"ఏం? బాగానే వుంటోంది." అన్నాడు. ఒక్క నిముషం ఆగి, "మా అమ్మ రానురానూ అస హ్యంగా తయారైందోయ్. ఇంట్లో సుఖం లేకుండా చేస్తోంది. ఆవిడకి తెలియదు, చెబితే వినదు. మా ఆవి డకీ, మా అమ్మకీ పడదు. అదే ఈ చికాకంతటికీ కారణం." అన్నాడు. రమణకి ఎమ్. యస్. సీ. చదువుతున్న రోజుల్లో పెళ్ళయింది. అతడికి ఇంటరు, బి. యస్. సి. చదవడానికి ధన సహాయం చేసిన ఇంజ నీరుగారే కూతుర్నిచ్చి పెళ్ళి చేశారు.

"నాకు మేనమామ ఒకడున్నాడు. చిన్నప్పటి నుంచీ మేము ఉన్నామో చచ్చేమో చూడలేదు గాని నేను వృద్ధిలోకి వచ్చి ఎమ్. యస్. సీ చదువుతూ

వుంటే పిల్లనిస్తాను పెళ్లిచేసుకోమని చెప్పొచ్చాడు. అప్పటికే ఈ సంబంధం నాకు ఓ మాదిరిగా నిశ్చయం అయిపోయింది. నే నా మేనమామ కూతుర్ని చేసుకోనన్నాను. నాకూ మా అమ్మకీ తగువైపోయింది. నాకు పెళ్ళయిన దగ్గిర్నుంచీ అమ్మతో పడడంలేదు. ప్రతి చిన్నదానికీ మా ఆవిడని సాధిస్తుంది. చాలారోజులు మా ఆవిడ మా అమ్మతో సర్దుకుపోడానికే ప్రయత్నించింది. కాని మా అమ్మ ధోరణి మితిమీరిపోయి సహించడానికి రాకుండా అయిపోయింది. నోటికొచ్చిన తిట్లుతిట్టేస్తుంది. చివరకి మా ఆవిడ ఎదురుతిరిగింది. అత్తగారు తిట్టేతిట్లన్నీ సహించి రాయిలా ఊరుకోమని మా ఆవిడని సముదాయించలేను; మా అమ్మని సరైన దారిలో పెట్టలేను. అధ్వాన్నంగా ఉంది నా స్థితి. ఇంట్లో ప్రతి చిన్నపనీ తన ఇష్టంవచ్చినట్లు జరగాలని ఆమె అభిప్రాయం. ఒకసారి మా ఆవిడ నా జీతంవచ్చిన రోజున అవసరంఉండి రెండు చీరలు కొనుక్కుంది. ఆ రాత్రి మా అమ్మతో యుద్ధమైపోయింది. పెద్ద వాదన లేవదీసి భోజనం మానేసి పడుకొంది. అలాగే రోజూ ఏదోవస్తూవుంటుంది. ఇంకోనాడు ప్రొద్దున్న వంటకి బియ్యం ఎన్నివెయ్యాలో తనని అడగకుండా వేసినందుకు పెద్దదెబ్బలాట లేవదీసింది. ఏం చెయ్యను? నిజానికి ఎన్ని బియ్యం వెయ్యాలో మా అమ్మని అడుగుతే మా ఆవిడకి ఆఖరికి అన్నం చాలకుండా అయేటట్టు చెబుతుంది. ఇంతటి సంకుచితత్వాన్ని ఎలా దారిలోకి తేవాలో తెలియదు." అన్నాడు. వర్షంలో తడిసిన రెండు కాకుల్లాగ ఒకర్నొకరు ఓదార్చుకొంటూ ఇరవై ఏళ్లు కష్టాలలో కలిసి బ్రతికిన ఆ తల్లీ కొడుకుల సంబంధం చివరకి ఇలా పరిణమించినందుకు నాకు చాలా విచారం కలిగింది. రెండునిముషాలు ఆగి రమణ మళ్లీ అందుకొన్నాడు.

"ఐదురోజుల క్రిందట పరిస్థితి మరీ విషమించి పోయింది. ఉత్తపుణ్యానికి మా ఆవిడని తిట్టిపోస్తోంది. కనిపెంచినందుకు మా అమ్మ ఏమన్నా నేను పడాలి గాని మా ఆవిడ ఎందుకు ఓర్చుకోవాలి? నేను చూస్తూ ఊరుకోలేకపోయాను. కలుగజేసుకొని ఏదో చెయ్యకపోతే లాభంలేదని పించింది. "ఇలాగైతే నేనింక ఊరుకోలేనమ్మా, నెలనెలా నలభయ్యో ఏభయ్యో రూపాయలు పంపిస్తూ వుంటాను, మీఅన్నయ్య దగ్గిరో ఎవరిదగ్గిరో వుండు. నాఇంట్లో ఉండనక్కరలేదు. నీమూలాన ఇంట్లో ఎవరికీ సుఖంలేకుండా పోతోంది." అన్నాను.

ఈమాటలు నేను బాగా ఆలోచించి తెచ్చిపెట్టుకొన్న ఉద్రేకంతో అన్నాను. అప్పటికైనా ఆ ధోరణి మారుతుందేమోనని కాని తర్వాతంతా మా అమ్మని అలా అన్నందుకు బాధపడ్డాను. ఇరవై ఏళ్లు కనిపెంచిన కొడుకు నోటంట చివరకు ఆమాటలు వచ్చేసరికి ఆమె మనస్సు ఎంత కుమిలిపోయి వుంటుందో అనిపించింది. ఆరాత్రి నాకు నిద్రలో పీడకల వచ్చింది. మాఅమ్మ నామీద కోపం కొద్దీ నూతిలో పడిపోయినట్లు కలవచ్చింది. నేను భయపడి పోయి లేచాను. మర్నాటినుంచీ మాఅమ్మ ఏడుపు బాగా ఎక్కువై పోయింది. "నువ్వూ నీ పెళ్లాం కలిసి వెళ్లగొడదామని చూస్తున్నారు. నాచేత చాకిరీ చేయించుకొని పెద్దవాడి వయావు. ఇంక నా అవసరం నీకులేదు. నన్ను ఇంట్లోంచి పొమ్మంటున్నావు. నేనింక బ్రతకలేను. ఏనుయ్యో గొయ్యో చూసు

భారతి సచిత్ర మాసపత్రిక

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		
4 వ కవరు పేజి	కాజువల్	కంట్రాక్టు
2 లేక 3 రంగులు	రు. 125/-	రు. 100/-
2 లేక 3 వ కవరు పేజి		
ఒకే (నలుపు) రంగు	90/-	75/-
లోపలి పేజీలు		
పూర్తి పేజి	70/-	60/-
అర్థ పేజి	35/-	30/-
పావు పేజి	20/-	15/-

ప్రత్యేక స్థానములకు 25% అధికం.

సం॥నకు వరుసగా 12 ప్రకటనలు చేయు వారికే కాంట్రాక్టు రేటు వర్తించును

* కవులు, కళాకారులు, రచయితలు మొదలైన వారి ప్రకటనలు ఒక కాలం ఇంచికి లేఖకు రు. 2/- చొప్పున ప్రకటించబడును

మేనేజరు, భారతి,

మద్రాసు-1.

కొంటాను" అంటూ క్రొత్తధోరణి మొదలెట్టింది. నాకు భయం వేసింది. ఇంక మా అమ్మను ఏమనాలో, ఎలా దారిలో పెట్టాలో తెలియదు. ఇలా అరిచి అరిచి ఎప్పుడో ఓనాడు పిచ్చెత్తి పోతుందేమో అనిపిస్తోంది" అని ముగించాడు. "అయ్యో!" అనిపించింది నాకు. తన కొడుకుమీద సర్వ అధికారాలూ తనవే అనుకొంటుంది ఆ తల్లి. కొడుకుకోసం ఎన్ని కష్టాలైనా పడుతుంది. ఎంతో గాఢంగా ప్రేమిస్తుంది కొడుకుని. కాని ఆ ప్రేమలో నిర్మలత లేదు. హృదయాన్ని వికసింప చెయ్యదు. చాలా సంకుచితమైనది. తనబిడ్డని ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమిస్తూనే ఇతరుల బిడ్డల్ని శత్రువులకన్నా ఎక్కువగా ద్వేషించగలిగేటంత సంకుచితత్వం అది! తన బిడ్డకోసం ఇంకో తల్లి బిడ్డను ఖూనీ చెయ్యడానికి కూడా వెనుదియ్యదు తల్లి హృదయం! రమణ తల్లి పరిస్థితి అలాగే వుంది. ఆమె కొడుకే సర్వస్వం అనుకొంది. తనకీ, తన కొడుకుకీ మధ్య కోడలువచ్చి ఇద్దర్నీ వేరుచెయ్యడం ఆమె సహించలేకపోతోంది. ఆమెకు ఇంట్లో పనులు చేసిపెట్టి, మనవలని కనే కోడలు కావాలిగాని, తన కొడుకు ప్రేమని ఆక్రమించుకొనే కోడలు అక్కరలేదు. అది పగగామారి ఇంటిని నరకప్రాయం చేస్తోంది. ఈ ఉద్రేకంలో, ఈ పరాజయంలో ఆమెకు మతిభ్రమణంకూడా కలుగవచ్చు. ఇప్పటికే ఆమె మోహం దీనంగా, పిచ్చిదానిలా అర్థంలేకుండా ఉంది. పాపం! రమణ! తల్లిప్రేమ సాలెపట్టులా తన చుట్టూ అల్లుకొంటే అందులో ఈగలాగ చిక్కుకొని బాధ పడుతున్నాడు.

మర్నాడు నేను విశాఖపట్నంనుండి బెజవాడ బయలుదేరాను. రైల్లో అంతా రమణ గురించే ఆలోచన. రైలు బెజవాడ ప్లాట్‌ఫారమ్మీద ఆగేవరకూ నాకు మా చెల్లెలు, దాని కుటుంబం గురించి స్ఫురణే లేదు. ప్లాట్‌ఫారమ్మీద మా బావ కనిపించాడు. ఇద్దరం జట్కాబండిమీద ఇంటికి చేరుకొన్నాం. మా చెల్లెలు పిల్లలు ముగ్గురూ నన్ను చుట్టుకొంటే ఆ సందడిలో మునిగిపోయాను. చాలాసేపు సరదాగా గడిచిపోయింది.

"నీళ్లు కాగేయి స్నానానికి రా అన్నయ్యా!" అని పిలిచింది మా చెల్లెలు లక్ష్మి.

"వస్తున్నానమ్మా!" అని అప్రయత్నంగా అన్నాను. కాని అందులో 'అమ్మా' అనే మాటతో గుండె గతుక్కుమంది. మా చెల్లెలు సరిగా మా అమ్మ పోలిక. ఆ ఆప్యాయతతోటే, ఆ ప్రేమతోటే సరిగా మా అమ్మ నా కళ్లముందు నిలిచినట్లయింది. తువ్వాలు తీసుకొని బరువుగుండెతో స్నానానికి బయలుదేరాను.